సాక్షి తిరుపతి

మంగళవారం। 25। ఏప్రిల్। 2023



కబళించిన గంగకాలువ

తెలుగు గంగ కాలువ నలుగురిని కబళించింది. వేర్వేరు ప్రాంతాల్లో గంగ కాలువలో పడి నలుగురు ప్రాణాలొదిలారు. – 8లో



ఎర్రచందనం స్వాధీనం

పంట పొలాల్లో ఎర్ర చందనం దుంగలను శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. – 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	35	25
తిరుమల	30	21
గూడూరు	36	27
నగరి	36	26

న్యూస్‌రీల్

ఏపీఆర్ఎస్ దరఖాస్తుల గడువు పొడిగింపు

వెంకటగిరి: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహించే ప్రవేశ పరీక్షల దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 28వ తేదీ వరకూ పొడిగించినట్లు వెంకటగిరి ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపల్ కె సరస్వతీదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత ఈనెల 24వ తేదీవరకూ ఉండగా తాజాగా ఈనెల 28వ తేదీకి పొడిగించారని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు http// aprs.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

గూడూరులో విశేష 'స్పందన'



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

గూడూరు : పట్టణంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి స్పందన కార్యక్రమం నిర్వహించి పలు సమస్యలను సత్వరమే పరిష్కరించారు. ముందుగా ఫిర్యాదుదారులకు సైబర్‌నేరాలు, ఆస్తి తగాదాలు, బెదిరింపులు, ఘర్షణలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట ప్రాంతాల వారికి కొంతదూరం ఉండడంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు జిల్లా కేంద్రానికి రావాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పోలీసులు కూడా ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అవలంభించాలని సూచించారు. ఫిర్యాదుదారులకు రుచికరమైన భోజనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఒకటవ, రెండో పట్టణ, రూరల్, వాకాడు సీఐలు హజరత్ బాబు, వెంకటేశ్వరరావు, దశరథరామారావు, హరికృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వేసవి సెలవుల సందర్భంగా వివిధ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఫండమెంటల్ నుంచి అడ్వాన్స్‌డ్ కోర్సుల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల్లో చేరదలచిన వారు కనీస విద్యార్హత 7వ తరగతి ఉండాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, గృహిణులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తి ఉన్న వారు తమ కళాశాలలోని మైక్రో ప్రాసెసర్ అండ్ నెట్‌వర్కింగ్ ల్యాబ్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 99851 29995, 78999 51463ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

కలెక్టరేట్‌లో స్పందనకు 100 అర్జీలు

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనకు మొత్తం 100 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం స్పందనకు వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పాల్గొన్నారు. మొత్తం అన్ని శాఖలకు కలిపి వంద అర్జీలు రాగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 69 ఉన్నట్లు అధికారులు తెలిపారు.

1 నుంచి సీఎం కప్ టోర్నమెంట్

తిరుపతి అర్బన్: ఆంధ్ర ప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మే 1 నుంచి ఏపీ సీఎం కప్ టోర్నమెంట్‌ను తిరుపతి నిర్వహించనున్నట్లు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్,కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మే 1 నుంచి 5వ తేదీ వరకు తిరుపతి నగరంలోని 14 ప్రదేశాల్లో(గ్రౌండ్స్‌లో)ఈ సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 4,999 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఒక్కో జిల్లా నుంచి 357 మంది క్రీడాకారులుంటే, అందులో 178 మంది మహిళలు, 179 మంది పురుషులు ఉంటారని వివరించారు. ప్రధానంగా క్రీడాకారులకు అవసరం అయిన మెరుగైన సౌకర్యాల కల్పన సీఈవో సెట్విన్ ఆధ్వర్యంలో చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సెట్విన్ మురళీకృష్ణ రెడ్డి, చీఫ్ కోచ్ సయిాద్ సాహెబ్‌తోపాటు శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, ఎస్వీ జూనియర్ కళాశాల, ఎస్వీ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల, ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల, శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు గంగాభిషేకం



తెలుగుగంగ కాలువలో ప్రవహిస్తున్న నీరు

ఈ సారి ఖరీఫ్ పంటలకు తెలుగు గంగ నీరు ప్రాణం పోయనుంది. ఇలా ఒక ఏడాదిలో రెండో సీజన్‌కు గంగ నీరు ఇవ్వడం ఇది నాలుగోసారి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాక ముందు వరకు కేవలం రబీ సీజన్‌లో పండించే పంటలకు మాత్రమే తెలుగు గంగ నీరు ఉపయోగపడేది. ఈ ఖరీఫ్‌లో లక్షా 40 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. అందు కోసం కండలేరు జలాశయం నుంచి తెలుగు గంగ కాలువ ద్వారా 1700 క్యూసెక్కుల నీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

- వరుసగా నాలుగోసారి రెండో సీజన్‌కు గంగనీరు
- గతంలో రబీ సీజన్‌కు మాత్రమే నీటి విడుదల
- ఈ సారి 1.40 లక్షల ఎకరాలకు సాగునీరు

సంవత్సరం	రబీ	ఖరీఫ్
	(ఎకరాలు లక్షల్లో)	
2020లో	1.75	1.25
2021లో	1.80	1.30
2022లో	1.85	1.35
2023లో	1.90	1.40

ఖరీఫ్‌లో ప్రధాన పంటలు

వరి	జొన్నలు
వేరుశనగ	సజ్జలు
రాగి	కూరగాయలు

తిరుపతి అర్బన్: ఖరీఫ్ సీజన్‌లో తెలుగు గంగ కాలువ నుంచి సాగు నీరందించేందుకు జలవనరులశాఖ అధికారులు వారం రోజుల క్రితమే ప్రభుత్వానికి నివేదికలు అందించారు. ఈ మేరకు ప్రభుత్వం సాగునీరుతో పాటు వంద గ్రామాలకు, రెండు పట్టణాలకు తాగునీరు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ ఖరీఫ్ (ఏప్రిల్ 20 నుంచి ఆగస్టు 20) సీజన్‌లో తెలుగుగంగ నీటిని 1.40లక్షల ఎకరాలకు అందించనున్నారు. అయితే అధికారుల 1500 క్యూసెక్కుల నీరు అవసరమవుతుందని నివేదికలో పేర్కొనగా, ప్రభుత్వం సాగు, తాగునీటికి కలిపి మొత్తం 1700 క్యూసెక్కుల నీటిని ఇవ్వాలని ఆదేశించింది. వంద గ్రామాలతోపాటు శ్రీకాళహస్తి పట్టణం, తిరుపతి నగరానికి సరఫరా చేయాలని స్పష్టం చేసింది.

తెలుగుగంగ కాలువ నుంచి సుమారు 40 ఏళ్లుగా పంటలకు నీరందిస్తున్నారు. అయితే రబీ సీజన్‌లో మాత్రమే రైతులకు సాగునీరు ఇచ్చేవారు. రబీ సీజన్‌లో తమిళనాడుకు ఏటా నీరు విడుదల చేయాల్సి ఉంది. రైతులకూ అదే సీజన్‌లో 1.70లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేవారు. అయితే జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత తమిళనాడుకు నీరు అందించే సమయంలోనే కాకుండా సోమశిల-కండలేరు జలాశయంలో నీటి నిల్వను బట్టి రైతులకు రెండో సీజన్ అయిన ఖరీఫ్‌లోనూ సాగునీరు అందించాలని ఆదేశించింది. దీంతో 2020 ఖరీఫ్ సీజన్ నుంచి రెండు సీజన్లకు సాగునీరు అందిస్తున్నారు. గత ఏడాది రబీ సీజన్‌లో 1.90లక్షల ఎకరాలకు గంగనీరు అందించిన ప్రభుత్వం ఈ సారి ఖరీఫ్‌లో 1.0లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని నిర్ణయించారు.

ఒక టీఎంసీతో 10వేల ఎకరాలు సాగు

కండలేరు జలాశయంలో ప్రస్తుతం 40 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 11500 క్యూసెక్కుల నీటిని 24గంటల పాటు విడుదల చేస్తే (నీరు కాలువ ద్వారా వెళితే) ఒక టీఎంసీగా పరిగణిస్తారు. ఒక టీఎంసీ నీటితో 10వేల ఎకరాలు సాగు చేయవచ్చు. ప్రస్తుతం కండలేరు జలాశయం నుంచి 1700 క్యూసెక్కుల నీటిని పంపుతున్నారు. ఆగస్టు 20వ తేదీ వరకు పంటలకు నీటిని అందించనున్నారు. తర్వాత నవంబర్ 1వ తేదీ నుంచి రబీ సీజన్‌కు నీటిని ఇవ్వనున్నారు.



తెలుగుగంగ కాలువ నీటిని పరిశీలిస్తున్న అధికారులు

సద్వినియోగం చేసుకోండి



“ కండలేరు జలాశయం నుంచి ఖరీఫ్‌కు సాగు నీటిని అందిస్తున్నాం. మరోవైపు జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు అందుబాటులోకి వస్తేనే అన్నదాతలకు సాగునీరు, జిల్లా ప్రజలకు తాగునీరు ఇబ్బందులుండవు. ఈ క్రమంలోనే జిల్లా వ్యాప్తంగా పరిశీలన చేస్తున్నాం. బీడు భూములు సైతం సాగులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నాం. ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకునే దిశగా రైతులు ముందుకు సాగాలి.

– కే.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి


రెండో పంటకు గంగనీరు



గతంలో ఎన్నడూ లేనివిధంగా నాలుగో సారి రెండు సీజన్లకు నీరు ఇస్తున్నాం. ప్రభుత్వం ప్రాజెక్టులు, రిజర్వాయర్ల ద్వారా పెద్ద ఎత్తున సాగు నీరు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తమిళనాడు ప్రాంతంలో తెలుగు గంగ కాలువ మరమ్మతులు జరుగుతున్నాయి. దీంతో వారు ఇక్కడి నుంచి నీరు అవసరం లేదని చెప్పారు. 60 రోజుల తర్వాత తమిళనాడు అవసరాన్ని బట్టి రెండు టీఎంసీలు నీరు ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– హరినారాయణరెడ్డి, చీఫ్ ఇంజినీరు, తెలుగుగంగ కాలువ

ఇది రైతుల ప్రభుత్వమే



జగనన్న ప్రభుత్వం రైతు ప్రభుత్వమని మరోసారి చాటుకుంది. కండలేరు జలాశయంలో నీటి నిల్వలు ఉన్నప్పటికీ రెండో సీజన్‌కు నీరు ఇచ్చేవారు కాదు. తమిళనాడుకు నీరు విడుదల చేసినప్పుడు (రబీ సీజన్‌లో) మాత్రమే సాగునీరు ఇచ్చేవారు. అయితే జగనన్న ప్రభుత్వం నీటిని రెండో పంటకు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. గంగనీరు వస్తే బోర్లు, బావులోనూ నీటి మట్టం పెరుగుతుంది. దీంతో సాగు, తాగునీటి సమస్యలు ఉండవు.

– సుబ్రమణ్యం రెడ్డి, కొత్త మారికుప్పం, సత్యవేడు మండలం

పంచాయతీల అభివృద్ధే ప్రగతి సూచిక



ప్రమీల, ఆర్ముగం, పులిశాంతమ్మ, మల్లారపు నాగరాజును సత్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

- అవార్డు పొందిన సర్పంచ్‌లకు కలెక్టర్ సన్మానం

తిరుపతి అర్బన్: గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రగతికి, సర్పంచ్‌ల పనితీరుకు సూచిక అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉత్తమ సేవలు అందించి, గుర్తింపు తెచ్చుకున్న సర్పంచ్‌లను కలెక్టర్ సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌లు తమ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఫొటోలతోపాటు వివరాలను రాష్ట్రస్థాయికి పంపడంతో ఉత్తమ సర్పంచ్‌లుగా ఎంపిక చేశారని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారికి సన్మానం చేస్తున్నట్లు వివరించారు.

ఉత్తమ పంచాయతీలు

జిల్లా స్థాయిలో 2022–23 సంవత్సరానికి సంబంధించి ఉత్తమ సేవలు అందించిన సర్పంచ్‌లను సన్మానానికి ఎంపిక చేశారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కలిగిన గ్రామ పంచాయతీగా వెంకటగిరి మండలం జంగాలపల్లి (సర్పంచ్ ప్రమీల), పరిశుభ్రమైన హరిత గ్రామ పంచాయతీగా తడ మండలం, తడ (సర్పంచ్ ఆర్ముగం), స్వయం సమృద్ధి కలిగిన పంచాయతీగా నాయుడుపేట మండలం కూడేరు (సర్పంచ్ పులి శాంతమ్మ), సుపరిపాలన కలిగిన గ్రామ పంచాయతీగా వాకాడు మండలం నిడుకుర్తి (సర్పంచ్ మల్లారపు నాగరాజు)ని ఎంపిక చేశారు.

రాష్ట్ర స్థాయికి కాదలూరు

తడ మండలంలోని కాదలూరు గ్రామపంచాయతీ సర్పంచ్ కిలివేటి మస్తానమ్మ పచ్చదనం పరిశుభ్రత అంశంలో రాష్ట్ర స్థాయిలో ఎంపికైనట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్ రెడ్డి, డీఎల్‌పీఓ పారాణి, గూడూరు డీఎల్పీఓ వెంకటరమణ, సర్పంచులు పాల్గొన్నారు.

నకిలీలపై నిఘా



- డూప్లికేట్ వెబ్‌సైట్ల సూత్రధారుల కోసం అన్వేషణ
- 41 నకిలీ వెబ్‌సైట్లపై పోలీసులకు ఫిర్యాదు
- భక్తులను అప్రమత్తం చేసిన టీటీడీ

సాక్షి, తిరుపతి: శ్రీవారి దర్శన టికెట్ల బుకింగ్ కోసం ఉపయోగించే నకిలీ వెబ్‌సైట్లపై టీటీడీ నిఘా పెట్టింది. అక్రమ సంపాదనే లక్ష్యంగా, కేటుగాళ్ల కదలికలపై దృష్టి పెట్టింది. వెబ్‌సైట్ల సూత్రధారులపై ఒక్కొక్కరిపైన చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇప్పటికే 41 నకిలీ వెబ్‌సైట్లను గుర్తించి వారిపై టీటీడీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శన టోకెన్లు, సమాచారం, విరాళాలు ఇచ్చేందుకు లక్షలాది మంది భక్తులు నిత్యం టీటీడీ వెబ్‌సైట్‌ను సందర్శిస్తుంటారు. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కొందరు నకిలీ టీటీడీ వెబ్‌సైట్లను సృష్టించారు. భక్తులను నిలువునా దోచుకుంటున్నారు.

డిమాండ్‌తోనే నకిలీ వెబ్‌సైట్లు

పరిస్థితుల నేపథ్యంలో టీటీడీ పరిమిత సంఖ్యలోనే భక్తులను దర్శనానికి అనుమతించే అవకాశం ఉండడంతో డిమాండ్ పెరుగుతూనే ఉంది. శ్రీవారి ఆలయంలో నిత్యం ఆగమశాస్త్ర బద్ధంగా పూజాకైంకర్యాలు నిర్వహిస్తారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు 16 గంటలు శని, ఆదివారాలలో 18 గంటల పాటు దర్శనానికి అనుమతిస్తారు. మహాలఘు విధానంలో భక్తులను అనుమతించినా గంటకు 4,500 మంది మించి దర్శనం చేసుకునే అవకాశం ఉండదు. స్వామివారికి నిర్వహించే ఆర్జిత సేవల్లో 150 మందికి మించి అనుమతించలేరు. దీంతో స్వామివారి దర్శనం కోసం, ఆర్జిత సేవల కోసం దేశవ్యాప్తంగా ఉన్న భక్తుల నుంచి డిమాండ్ ఉంటోంది. భక్తులకు కొంత ఉపశమనం కల్పించడానికి టీటీడీ ఆన్‌లైన్ విధానంలో దర్శన, సేవా టికెట్ల విక్రయాలను ప్రారంభించింది. నెలకు 3 లక్షల వరకు శ్రీవారి దర్శన టికెట్లు, 50 వేల వరకు సేవా టికెట్లు కేటాయిస్తోంది. వీటిని ఆన్‌లైన్‌లో విడుదల చేసిన నిముషాల వ్యవధిలో భక్తులు కొనుగోలు చేస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు కేటుగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి భక్తులను నిలువునా దోచేస్తున్నారు. టీటీడీ పేరు చెప్పి అక్రమార్కులు ఆకర్షణీయమైన ప్రకటనలతో భక్తులకు వలవేస్తున్నారు. ఇలా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న నకిలీ వెబ్ సైట్ల బెడద నుంచి భక్తులను రక్షించడానికి టీటీడీ పటిష్టమైన చర్యలకు పూనుకుంది. భక్తులు సులభంగా గుర్తించడానికి https://tirupatibalaji.ap.gov.in పేరుతో వెబ్‌సైట్‌ను టీటీడీ భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే దీన్ని ఆసరాగా చేసుకుని నకిలీలు రెచ్చిపోయారు. నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి జేబులు నింపుకోవడం ప్రారంభించారు. దీనిపై పలుమార్లు టీటీడీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇలా ఇప్పటికే 40 వెబ్‌సైట్లపై ఫిర్యాదు చేయగా తాజాగా ఆదివారం మరో వెబ్‌సైట్ (https://tirupatibalaji-ap-gov.org) పై టీటీడీ ఫిర్యాదు చేసింది. అదే సమయంలో ఈ వెబ్‌సైట్‌పై విస్తృతంగా ప్రచారం చేసి, భక్తులను అప్రమత్తం చేసింది.

సూత్రధారులపై ప్రత్యేక నిఘా

నకిలీ వెబ్ సైట్ల సూత్రధారులపై టీటీడీ నిఘా పెట్టింది. టీటీడీ ఆలయ నమూనాలు, ఆనంద నిలయం, శిలాతోరణం, తిరుమల సప్తగిరుల ఫొటోలతో కూడిన నకిలీ వెబ్ సైట్‌లను క్రియేట్ చేయడంతో భక్తులు మోసపోతున్నట్లు గుర్తించారు. నకిలీ వెబ్‌సైట్‌ల సూత్రధారులపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు టీటీడీ సిద్ధమైంది.

అందరికీ ఆరోగ్యం.. అదే చెవిరెడ్డి లక్ష్యం!

- చంద్రగిరి నియోజకవర్గంలో 5 లక్షల మందికి రక్త పరీక్షలు
- రూ.3వేల విలువైన రక్త పరీక్షలు పూర్తిఉచితం
- తొలిసారిగా కలెక్టరేట్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు





కలెక్టరేట్‌లో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఉద్యోగులు, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: అందరికీ ఆరోగ్యం.. అదే ఆయన లక్ష్యం.. ఆరోగ్యమే మహాభాగ్యం.. చంద్రగిరిని ఆరోగ్య సిరిగా మార్చేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం. తన నియోజకవర్గంలో జీవించే 5 లక్షల మందికి ఉచితంగా రక్త పరీక్షలు చేసి అంతర్గతంగా దాగియున్న ప్రాణాంతకమైన వ్యాధులను గుర్తించి తగిన వైద్యం అందించే ఓ మంచి కార్యక్రమానికి రంగం సిద్ధం చేశారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి వందేళ్ల ముదుసలి వరకు ప్రతి ఒక్కరికీ వారి స్వగ్రామంలోనే రక్త పరీక్షలు చేయనున్నారు. వందలాది మంది వైద్య సిబ్బంది, వేలాది మంది వలంటీర్లు, ప్రభుత్వ అధికారుల బృందం ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములవుతారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ వైద్యం, ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్న ఘనత చెవిరెడ్డికి దక్కుతుంది. వ్యాధి ముదిరిన తర్వాత చేసే ఖర్చు కన్నా వాటిని ముందుగానే గుర్తించడం మేలని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తలిచారు. ఇందుకోసం హైదరాబాదుకు చెందిన ప్రివియా హెల్త్ కంపెనీతో ఒప్పందం చేసుకుని అడుగులు ముందుకు వేస్తున్నారు. ఆ మేరకు కలెక్టర్, అధికారులతో చర్చించి, రూ.3000 విలువ చేసే 58 రకాల రక్త, గుండె పరీక్షలను ఉచితంగా చేయించాలని నిశ్చయించారు.

ఏరియా ఆస్పత్రికి అధునాతన యంత్రాలు

చంద్రగిరి ఏరియా ఆస్పత్రిలో సెంట్రల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. గంటకు 6,200 పరీక్షలు చేసే రెండు బయోకెమిస్ట్రీ మిషన్లు, గంటకు 400 పరీక్షలు చేసే ఇమ్యూనో ఎనలైజర్ యూనిట్లు, గంటకు 160 రక్త పరీక్షలు చేసే రెండు బ్లడ్ సెల్స్ యూనిట్లు ఇప్పటికే సెంట్రల్ ల్యాబ్‌కు చేరుకున్నాయి. రిజిస్ట్రేషన్ నుంచి రక్తసేకరణ చేసి వాటిని పరీక్షలు చేసిన తర్వాత ఫలితాలను ప్రకటించే వరకు అత్యాధునిక టెక్నాలజీతో ఓ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

కలెక్టరేట్ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

ఉచిత రక్త పరీక్షలను జనం ముందుకు తీసుకువచ్చిన ఎమ్మెల్యే చెవిరెడ్డి తొలిసారి కలెక్టరేట్ ఉద్యోగులకు నిర్వహించారు. సోమవారం కలెక్టర్ కార్యాయంలో పనిచేసే ప్రతి ఉద్యోగికీ రక్త పరీక్షలు, గుండె పరీక్షలు నిర్వహించారు. మొదటగా జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, జేసీ డీకే బాలాజీ, డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడుతో పాటు జిల్లా ఉన్నతాధికారులు అందరూ రక్త పరీక్షలు, గుండె పరీక్షలు చేయించుకున్నారు. కార్యాలయంలో దాదాపు 550 మంది ఉద్యోగులకు పరీక్షలు చేశారు. ఈనెల 26న పాకాల మండలం దామల చెరువు జెడ్పీ హైస్కూల్లో ప్రజల నుంచి రక్త సేకరణ జరిపి ఆ కార్యక్రమాన్ని లాంఛనం ప్రారంభించనున్నారు.

వ్యర్థాలతో వస్తు తయారీ శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతి మహిళా వర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిరుపయోగంగా ఉన్న గృహోపకరణాలు, వ్యర్థ పదార్థాలతో ఉపయోగకరమైన వస్తు సామగ్రి తయారీపై శిక్షణ ఇచ్చారు. ప్రొఫెసర్లు టి.సుధ, ఎం.ఉషారాణి ఎంసీఏ విద్యార్థినులకు శిక్షణతోపాటు అవగాహన కల్పించారు. వ్యర్థాలను రీసైక్లింగ్ ద్వారా అందమైన గృహోపకరణాలను తయారుచేయడం వల్ల కొంతవరకు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని సూచించారు.

పాము కాటుకు కూలీ మృతి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని బోనుపల్లి కొండకింద ఎస్టీ కాలనీకి చెందిన కూలీ సుబ్రమణ్యం(35) పాము కాటుకు గురై మృతి చెందాడు. ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు సోమవారం వ్యవసాయ పనులకు వెళ్తుండగా పాముకాటుకు గురై మృతి చెందారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నలుగురిని కబళించిన గంగకాలువ

పంటలకు ప్రాణం పోసే తెలుగు గంగ కాలువ నలుగురిని కబళించింది. వేర్వేరు ప్రాంతాల్లో గంగ కాలువలో పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సోమవారం వెలుగు చూశాయి. సైదాపురం మండలంలో ప్రాణస్నేహితులిద్దరూ దాహార్తి తీర్చుకోవడానికి వెళ్లి నీట మునిగి కన్నుమూశారు. దొరవారి సత్రం మండలంలో ఈతకెళ్లిన ఇంటర్ విద్యార్థి మృత్యుఒడికి చేరుకున్నాడు. పెళ్లకూరు మండలంలో బట్టలు తకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి కొట్టుకుపోయాడు.

మరణంలోనూ వీడని స్నేహ బంధం


మహేష్(ఫైల్)


చైతన్య(ఫైల్)

సైదాపురం: తెలుగు గంగ కాల్వలో పడి ఇద్దరు స్నేహితులు దుర్మరణం చెందడంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. ఈ సంఘటన మండలంలోని పెరుమాళ్లపాడులో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు, పెరుమాళ్లపాడుకు చెందిన అడ్లూరు మహేష్(28), చలంచెర్ల చైతన్య(29) చిన్నప్పటి నుంచి స్నేహితులు. మహేష్ ఆటోలో నిత్యం నిమ్మకాయలను తన స్వగ్రామం నుంచి గూడూరుకు తరలిస్తుండేవారు. ఆ ఆటోలోనే చైతన్య కూడా వెళుతుండేవారు. దానిపై వచ్చే ఆదాయంలో రెండు కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోనే ఉన్న తెలుగ గంగ కాల్వలో నీరు తాగేందుకు చైతన్య దిగాడు. అయితే ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి కొట్టుకుని పోతుండడంతో వెంటనే మహేష్ కాల్వలో దూకి రక్షించే ప్రయత్నం చేశారు. అయితే నీటి ఉధృతికి స్నేహితులిద్దరూ కాలువలోనే తుది శ్వాస విడిచారు. ఆ ప్రాంతంలో పశువులు మేపుకునే వారు కాల్వ వద్దకు వచ్చి చూడగా, అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రాణ స్నేహితులిద్దరూ ఒకే సారి మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. మహేష్‌కు పెళ్లి కాలేదు. అమ్మ, తమ్ముడు ఉన్నారు. చైతన్యకు మాత్రం భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బట్టలు ఉతుక్కోవడానికి వెళ్లి...


మృతి చెందిన రమేష్

పెళ్లకూరు: తెలుగుగంగ కాలువ వద్ద బట్టలు ఉతకడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, పునబాక చెరువు కండ్రిగ గ్రామానికి చెందిన కన్నలి రమేష్(52) అలియాస్ రమణయ్య బట్టలు ఉతుక్కోవడానికి గంగ కాలువపై ఉన్న చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడి కొట్టుకుపోయాడు. ఆర్లపాడు చెక్‌డ్యామ్ వద్ద రమేష్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ సుబ్రమణ్యం ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి ఒక కుమారుడు ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


కాలువలో నుంచి విద్యార్థి గిరి మృతదేహాన్ని తీసుకువస్తున్న స్థానికులు

ప్రాణం తీసిన ఈత సరదా


గిరి(ఫైల్)

దొరవారిసత్రం : సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. స్థానిక ఎస్ఐ కథనం మేరకు, తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులు, తులసి దంపతుల కుమారుడు కాశీగిరి(16) నెల్లూరులో ఇంటర్ ప్రథమ పరీక్షలు రాసి నాయుడుపేట పట్టణంలోని అమ్మమ్మ ఇంటికి కొన్ని రోజుల కింద వచ్చాడు. బంధువుల పిల్లలతో కలిసి కాశీగిరి నెలబల్లి గ్రామ సమీపంలోని తెలుగు గంగ కాలువలో ఈత కొట్టేందుకు ఆదివారం సాయంత్రం వెళ్లారు. కాలువలోని నీళ్లలోకి దూకి మునిగిపోయాడు. నీళ్లలోని దూకిన గిరి బయటకు రాకపోవడంతో అతనితో వచ్చిన ఇద్దరు భయాందోళనకు గురై ఇంటిలో రాత్రి వరకు చెప్పకుండా ఉండిపోయారు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న బంధువులు, పోలీసులు గాలింపు చర్యలు చర్యలు చేపట్టినా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. సోమవారం నాయుడుపేట సీఐ సోమయ్య, ఎస్ఐ ఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో గిరి మృతదేహాన్ని వెలికితీశారు. అక్కడికి విచ్చేసిన తల్లిదండ్రులు నిర్జీవంగా ఉన్న కొడుకుని చూసి కన్నీమున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,020
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,540
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,900
రిటైల్ వెండి గ్రాము	రూ.78.90

వెలుగులోకి 'సదరమ్' దందా

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆసుపత్రిలో సదరమ్ సర్టిఫికెట్లు ఇప్పిస్తానంటూ పేదలకు ఎరవేసి వేలాది రూపాయలు దండుకుంటున్న సుబ్రమణ్యం అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో నకిలీ సర్టిఫికెట్లతో సంచరిస్తున్న సుబ్రమణ్యంను సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని తనిఖీలు చేశారు. ఈనెల 17న నింద్ర మండలం, ఆరూరు గ్రామానికి చెందిన దర్బిల్ అనే బాధితుడు సుబ్రమణ్యం నుంచి మోసపోయానని మీడియాకు తెలిపారు. తాజాగా సోమవారం పాకాల మండలం, రమణయ్యగారిపల్లెకు చెందిన రజాక్ (56) తానూ మోసపోయానని మీడియా ముందుకొచ్చాడు.

వ్యక్తి ఆత్మహత్య

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని కొణతనేరికి చెందిన నాధముని (40) సోమవారం ఇంట్లోనే ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. అయితే అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి


మృతి చెందిన మోహన్ గురు


ఊర్మిళ

తిరుచానూరు(చంద్రగిరి): పిడుగుపాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి చెందినట్లు ఎస్ఐ జగన్నాథరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు, తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపట్టు పంచాయతీ వేమూరు గ్రామానికి చెందిన వ్యక్తి ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి పిడుగు పడటంతో బట్టీలో పనిచేస్తున్న ఐదుగురు ఒడిశా కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మోహన్ గురు(41), ఊర్మిళ(48) మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు


వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జగనన్న బీసీల సంక్షేమానికి బాటలు వేశారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నారాయణపురం పంచాయతీ జింగిలిపాలెం గ్రామంలోని టీడీపీకి చెందిన 20 బీసీ కుటుంబాలు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వీరిలో మద్దు రమణయ్యయాదవ్, మద్దు కృష్ణయ్యయాదవ్, మద్దు శంకరయ్యయాదవ్, మద్దు మునెయ్యయాదవ్, మద్దు మునిరామయ్యయాదవ్, అక్కుపల్లి బత్తెయ్య యాదవ్, అక్కుపల్లి వెంకట్రామయ్యయాదవ్, అక్కుపల్లి కిరణ్‌యాదవ్, నిమ్మల మునెయ్య యాదవ్, చిర్రి రామచంద్రయ్య యాదవ్, చీమల రామచంద్రయ్య యాదవ్, మక్కి బత్తెయ్యయాదవ్ ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయంగా అన్ని నామినేటెడ్ పదవుల్లో, చట్ట సభల్లో 50 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీల ఓట్లు వేయించుకునిందే తప్ప వారి బాగోగుల చేసిన చరిత్ర లేదని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు వెంపల్ల సురేంద్రయాదవ్, ఏనుగారి నాగభూషణ్‌యాదవ్, బిళ్ల చంద్రబాబుయాదవ్, కూనాటి చెంచయ్యయాదవ్, కూనాటి రామయ్యయాదవ్, వై.చెంచయ్య యాదవ్, గురవయ్యయాదవ్, బాలుయాదవ్, నాగేశ్వరరావుయాదవ్, చందుయాదవ్, వెంకటరత్నం యాదవ్, ప్రసాద్‌యాదవ్, శంకర్‌యాదవ్, కృష్ణయ్యయాదవ్ మునిరాజయాదవ్ తదితరులు ఉన్నారు.

సీనియర్ వైద్యులు సీఆర్‌రెడ్డి మృతి


డాక్టర్ సీఆర్‌రెడ్డి (ఫైల్)

గూడూరు: డాక్టర్ సీఆర్‌రెడ్డిగా పేరొందిన వైద్యులు చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి(95) అనారోగ్యంతో సోమవారం తుదిశ్వాస విడిచారు. పెనుబల్లి గ్రామానికి చెందిన చిల్లకూరు వెంకురెడ్డి, శేషమ్మల తృతీయ సంతానంగా 1929 మార్చి1న జన్మించారు. మద్రాసులో ఎంబీబీఎస్ పూర్తి చేసి 1956లో కోటలో ప్రభుత్వ వైద్యుడిగా చేరారు. అప్పట్లోనే కాలినడకన వెళ్లి ఎందరికో వైద్య సేవలందించి, ప్రజా వైద్యులుగా ఖ్యాతి గడించారు. గూడూరులో 1966లో సీఆర్ రెడ్డి ఆస్పత్రిని నెలకొల్పి సేవలను కొనసాగించారు. డాక్టర్ సీఆర్‌రెడ్డి కుటుంబంలో ఇప్పటి వరకూ 35 మంది వైద్య వృత్తిని అవలంబించారు. డాక్టర్ సీఆర్‌రెడ్డి పనిచేసిన ప్రతి చోటా విద్యాలయాలు ఏర్పాటు చేయడం మరో విశేషం. గిరిజనుల పిల్లల కోసం రూ.40 లక్షలకు పైగా వెచ్చించి సరస్వతీ శిశు మందిరాన్ని స్థాపించి విద్యాదానం చేస్తున్నారు. తనకు వచ్చేరూ.30 వేల పెన్షన్‌ను కూడా సరస్వతీ శిశు మందిరానికే వెచ్చించడం గమనార్హం. ప్రస్తుతం సీఆర్‌రెడ్డి ఆసరా పథకం ద్వారా ప్రతి నెలా వందలాదిమంది పేదలకు, దివ్యాంగులకు నెలకు సరిపడా సరుకులు అందజేస్తున్నారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

చంద్రగిరి(తిరుపతి రూరల్): మదనపల్లి–తిరుపతి జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, తిరుపతి రూరల్ మండలం, ఓటేరుకు చెందిన వేలాయుధం తన ద్విచక్ర వాహనంపై భాకరాపేట నుంచి తిరుపతికి బయల్దేరారు. అదే సమయంలో మంగళంపేట గద్దంవారిపల్లికి చెందిన మోహన్‌రెడ్డి మరో బైక్‌పై తిరుపతికి వస్తున్నాడు. రంగంపేట సమీపంలోని బ్రాందీ షాప్ వద్ద వేలాయుధం బైక్‌ను వెనక నుంచి మోహన్‌రెడ్డి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మోహన్‌రెడ్డి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై యాసిడ్ దాడి


ఆదిలక్ష్మి (ఫైల్)

రేణిగుంట: తొట్టంబేడు మండలం, బోనుపల్లి దళితవాడలో భార్యపై అనుమానంతో భర్త యాసిడ్ దాడి చేసిన ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. తొట్టంబేడు పోలీసుల సమాచారం మేరకు, బోనుపల్లి దళితవాడకు చెందిన సుధాకర్ కొయ్యబొమ్మల పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య ఆదిలక్ష్మి (31) రేణిగుంట సమీపంలోని ఓ సెల్‌ఫోన్ కంపెనీలో పనిచేస్తోంది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా భార్యపై అనుమానం పెంచుకుని తరచూ గొడవపడేవాడు. సోమవారం మధ్యాహ్నం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన ఆదిలక్ష్మితో ముందస్తు ప్రణాళిక ప్రకారం సుధాకర్ గొడవపడి ఆపై యాసిడ్ పోశాడు. గుర్తించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె భర్త సుధాకర్ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈమేరకు తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమలలో పాముల కలకలం



తిరుమల : తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో పాములు కలకలం సృష్టించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర్ నాయుడు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక గాలిగోపురం సమీపంలోని మెట్లదారిపై ఓ నాగుపాము వచ్చినట్లు దుకాణదారులు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం స్థానిక ఫిల్టర్ హౌస్ వద్ద మరో పాము వచ్చినట్లు సిబ్బంది తెలపడంతో అక్కడికి చేరుకుని ఏడు అడుగుల జెర్రిపోతును పట్టుకున్నారు. అనంతరం వాటిని అవ్వాచ్చారి కోనలో విడిచిపెట్టారు.

ఎర్రచందనం స్వాధీనం

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు 4 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం శ్రీకాళహస్తి మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం.. మండలంలోని మేలచ్చూరు గ్రామ సరిహద్దులోని పంట పొలాల్లో సారా కాస్తున్నట్లు శ్రీకాళహస్తి ఎస్ఈబీ అధికారులకు గుర్తుతెలియని వ్యక్తులు సమాచారం ఇచ్చారు. ఆ సమాచారం మేరకు ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరెడ్డి తమ సిబ్బందితో మేలచ్చూరు పొలాల్లోకి వెళ్లి దాడులు నిర్వహించగా నాలుగు ఎర్ర చందనం దుంగలు బయటపడ్డాయి. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. 80 కిలోల బరువున్న వీటి విలువ రూ.1,12,000 ఉంటుందన్నారు.

సంస్కృత అష్టావధానంలో ప్రతిభ చాటిన భరత్ శర్మ


అష్టావధానం నిర్వహిస్తున్న భరత్ శర్మ

తిరుపతి కల్చరల్: రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం వేదికగా మొట్టమొదటి సారి సంస్కృత భాషలో సోమవారం అష్టావధానాన్ని నిర్వహించి ఉప్పలధడియం భరత్ శర్మ ఉభయ భాషల్లోను తన పాండిత్య ప్రతిభను చాటుకున్నారు. ఆయన ఇప్పటి వరకు తెలుగు భాషలో 46 అష్టావధానాలు, ఒక శతావధానాన్ని నిర్వహించారు. రాష్ట్రీయ సంస్కృత వర్సిటీ వార్షికోత్సవంలో భాగంగా కులపతి ఆచార్య గుళ్లపల్లి శ్రీరామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో సంస్కృత అష్టావధానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృతంలో పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు భరత్ శర్మ సమాధానాలిచ్చారు. వర్సిటీ కులపతి మాట్లాడుతూ అంతరించిపోతున్న అష్టావధాన కళను వెలుగులోకి తెస్తున్న యువ శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ నేటి యువతరానికి మార్గదర్శకమన్నారు. అష్టావధానానికి అధ్యక్షుడిగా ప్రొఫెసర్ కేఎస్.రాజగోపాలన్ వ్యవహరించగా, పృచ్ఛకులుగా సోమనాథదాస్, భరత్‌భూషణ్, సీహెచ్.నాగరాజు, దత్తాత్రేయ శర్మ, సీతారాం శర్మ, ఎంజీఎస్ నందన్‌రావు, ఎస్.వైష్ణవి, గంగిరెసెట్టి లక్ష్మీ నారాయణ వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఇన్‌చార్జిల నియామకం



దేవదానం, రామాంజనేయులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ అనుబంధ విభాగమైన ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జిలను నియమిస్తూ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు నెల్లూరు, వైఎస్సార్, తిరుపతి జిల్లాలకు తిరుపతికి చెందిన విశ్రాంత ఏఎస్పీ ఎస్పీ దేవదానం, చిత్తూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాలకు అనంతపురం జిల్లాకు చెందిన జె.రామాంజనేయులను నియమించారు.